క్లుప్తంగా

అర్హులైన రైతులు రైతుబీమా చేసుకోవాలి

కేటీదొడ్డి: అర్హులైన రైతులు రైతు బీమా చేసుకోవాలని ఏఈఓలు ప్రీతిసుధ, ప్రియాంక తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 18 నుంచి 59 వయస్సు ఉన్న వారు రైతుబీమాకు అర్హులన్నారు. కొత్తగా పట్టా పాసుబుక్ 28 జూన్ 2024 రిజిస్ట్రేషన్ పూర్తయిన రైతులు, ఇప్పటి వరకు రైతు బీమా నమోదు చేసుకోని రైతులు వచ్చే నెల 4వ తేదీ వరకు రైతుబీమా చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు రైతు బీమా ఫారం, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లు పట్టాదారు స్వయంగా ఏఈఓలకు అందజేయాలన్నారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈ నెల 29 వరకు అవకాశం ఉందన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



అయిజ: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌ను ఇన్‌చార్జి ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠశాలకు బాత్‌రూంలు లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్తున్నారని పేర్కొన్నారు. క్రీడా మైదానం లేదని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తునారని కొందరు వ్యక్తులు ఇన్‌చార్జి ఎంఈఓకు ఫిర్యాదు చేయడంతో పాఠశాల యజమాని మల్లికార్జున్‌కి షోకాజు నోటీసులు జారీ చేశారు. పూర్తి విచారణ చేపట్టి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని ఇన్‌చార్జి ఎంఈఓ పేర్కొన్నారు.

పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లిచౌరస్తా: కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోదండాపురం ఎస్‌ఐ స్వాతి మంగళవారం సూచించారు. ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల జూరాల ప్రాజెక్టుకు అధికంగా వరద నీరు వస్తుందన్నారు. దీంతో జూరాల గేట్లు ఎత్తడంతో వరద నీరు దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేయడంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. నది సమీపంలో ఉండే వివిధ గ్రామాల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. పశువులతో పాటు గొర్రెలు, మేకల కాపరులు వాటిని మేపు కోసం నది సమీపంలోకి తీసుకెళ్లరాదని ఎస్‌ఐ పేర్కొన్నారు.

దివ్యాంగుడి బైక్ ధ్వంసం



రాజోళి: దివ్యాంగుడికి చెందిన మూడు చక్రాల బైక్‌ను దుండగులు కొందరు ధ్వంసం చేసిన ఘటన మంగళవారం మండంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని మాన్‌దొడ్డికి చెందిన దివ్యాంగుడు మాదన్న తన మూడు చక్రాల బైక్‌పై తన కార్యకలాపాలు సాగించేవాడు. బైక్‌ను ఇంటి బయట పార్క్ చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బైక్‌ను తీసుకెళ్లి ధ్వంసం చేసి డ్రెయినేజీ కాల్వలో పడేశారు. తనపై దుండగులు ఇలా చేయడం వేదనకు గురి చేస్తోందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై రాజోళి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

కూలిన మట్టి మిద్దె.. తప్పిన ప్రమాదం



రాజోళి: మండలంలోని తూర్పు గార్లపాడులో మట్టి మిద్దెకూలగా తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. తూర్పుగార్లపాడుకు చెందిన మార్కు కుటుంబం మట్టి మిద్దెలో నివసిస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిద్దె పూర్తిగా తడిసి మరింత మెత్తబడింది. సోమవారం రాత్రి మార్కు కుటుంబం రోజూ పడుకునే గదిలో కాకుండా పక్కగదిలో నిద్రించారు. బాగా తడిసిన మిద్దె రాత్రి సమయంలో కూలింది. వారు పడుకున్న గది మాత్రం పాక్షికంగా దెబ్బతినడంతో వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. సోమవారం రాత్రి పక్క గదిలో పడుకోవడం వల్ల పెద్ద ప్రమాదమే తప్పిందని బాధితులు పేర్కొన్నారు.

మద్యం బాబులపై కేసులు

రాజోళి: బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై రాజోళి పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో బహిరంగంగా మందు తాగుతున్న వారిని పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. మహిళలకు బహిరంగంగా మద్యం తాగుతున్న వారి వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ఎస్‌ఐ జగదీష్ గస్తీ నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

బీటీ ఉన్నా.. బస్సుల్లేవ్!

- గ్రామాలకు అందని ఆర్టీసీ సేవలు
- ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్న ప్రజలు, విద్యార్థులు
- అధిక చార్జీలతో నష్టం..
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఉండవెల్లి నుంచి డీ బూడిదపాడు వయా అలంపూర్ చౌరస్తా వరకు వెళ్లే బీటీ రోడ్డు

ఉండవెల్లి: మారుమూల గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సేవలు అందడం లేదు. రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ యాజమాన్యం పల్లెలకు బస్సు సేవలు కల్పించడంలో నిర్లక్ష్యం వీడడం లేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కిస్తున్నారు.

మారుమూల గ్రామాలకు..

మండలంలోని అనేక గ్రామాలకు నేటికీ ఆర్టీసీ సేవలు అందడం లేదు. మారుమూల గ్రామాల ప్రజలకు బస్సు సేవలు చేరడం లేదు. అలంపూర్ చౌరస్తా నుంచి ఉండవెల్లి మీదుగా కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల–1, 2 గ్రామాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు మాత్రమే బస్సు సర్వీసులు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పుల్లూరు మీదుగా కలుగోట్ల, మెన్నిపాడు, బొంకూరు నుంచి అయిజకు బస్సులు ప్రయాణిస్తుండేవి. ప్రయాణం చేయాలంటే బస్సులు లేక పాదయాత్రలు, బైకులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

నిలిచిన బస్సు సేవలు..

మండల కేంద్రం నుంచి మారమునగాల–1 గ్రామం వరకు బస్సు ప్రయాణించేది. గ్రామాల్లో ఇరుకు రోడ్లు, ఇతర సాకులు చూపుతూ బస్సు సేవలు నిలిపేసింది. బస్సు సేవలను తిరిగి కల్పించాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. ఇరుకు రోడ్లు, మూలమలుపుల వద్ద సులువుగా తిరిగేలా పెద్ద బస్సు స్థానంలో మినీ బస్సులు ఏర్పాటు చేసి పునరుద్ధరిస్తే ఈ సేవలు కొనసాగుతాయి. కర్నూల్ జిల్లా నుంచి బస్సు సర్వీసులు నిలిచిపోగా, ఇప్పటి వరకు మళ్లీ ప్రారంభం కాలేదు. ఆ రూటులో 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు.

బస్సుసర్వీసు పునరుద్ధరించాలి



మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి ఉండవెల్లి మీదుగా గతంలో నడిపిన ఆర్టీసీ బస్సు సేవలను మళ్లీ పునరుద్ధరించాలి. రోడ్డు సౌకర్యం ఉన్న చోట సేవలందక ఆటోల్లో వెళ్లాల్సిందే. అందుబాటులో బస్సు సేవలుంటే ఎంతో ఉపయోగకరం.

– రాజు, మారమునగాల–2

మినీ బస్సు ఏర్పాటు చేయాలి..



మండల కేంద్రానికి రావాలంటే ఆటో, బైక్ మీద ఆధారపడి రావాల్సిందే. ప్రభుత్వ ఆఫీసు లు మండల కేంద్రంలో ఉండడంతో బస్సు సౌకర్యం లేదు. ఆర్టీసీ డిపో మేనేజర్ చొరవ తీసుకుని బీటీ ఉన్న మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం అందించాలి. అలంపూర్ చౌరస్తాలో మినీ బస్సు ఏర్పాటు చేయాలి.

– అయ్యస్వామి, పుల్లూరు

పచ్చిరొట్టెతో నేలలో సేంద్రియ కార్బనం

- ఏడీఏ సక్రియ నాయక్



తిమ్మాపురంలో పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సక్రియ నాయక్

ఎర్రవల్లిచౌరస్తా: పచ్చిరొట్టె ఎరువులను సాగు చేసి భూమిలో కలియదున్నడం వల్ల నేలలో సేంద్రియ కార్బనం పెరుగుతుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. మంగళవారం ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురంలో రైతు రవీంద్రమ్మ సాగు చేసిన జీలుగ పంటను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి పచ్చిరొట్టె ఎరువుల ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీలుగ సాగు వల్ల నేలలో ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అధికంగా అందిస్తుందన్నారు. జీలుగను సాగు చేయడం వల్ల వరి పంటకు కావలసిన మూడు టన్నుల ఎరువు కేవలం పచ్చి రొట్ట ఎరువుల ద్వారా లభిస్తుందన్నారు. దీనివల్ల మొక్కలకు రెండు శాతం నత్రజని, జింక్ సూపర్ ఫాస్ఫేట్ అదనంగా అందుతుందన్నారు. నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి పచ్చి రొట్ట ఎరువులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. జీలుగ లెగ్యూమ్ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో అధికంగా నత్రజని కలిగి ఉంటుందన్నారు. దీని వల్ల పంటలో అధికంగా మొలిచే తుంగ, గరక వంటి కలుపు మొక్కలను ఎదగకుండా ఇవి అడ్డుకుంటాయన్నారు. పంటకు ముందు జీలుగ మొక్కలను సాగు చేసి భూమిలోకి కలియ దున్నడం వల్ల నత్రజని 27శాతం, భాస్వరం 53శాతం, పొటాషియం 22శాతంను పంటలోని మొక్కలకు అందిస్తాయన్నారు. ముఖ్యంగా వరి పంటల్లో జీలుగను వాడటం వల్ల రసాయనిక ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు రైతులకు పంట ఖర్చు తగ్గి, ఆదాయం పెరుగుతుందన్నారు.

రైతులతో ముఖాముఖి

ప్రభుత్వం ఇటీవల చేసిన రైతు రుణమాఫీ పథకంపై రైతులతో ఏడీఏ ముఖాముఖి నిర్వహించారు. రుణమాఫీ పొందిన రైతులు సంబంధిత బ్యాంకులకు వెళ్లి రుణం పొందాలన్నారు. ఏదైనా కారణం వల్ల రుణ విముక్తి పొందని రైతులు స్థానిక ఏఈఓలను సంప్రదించి సమస్యను తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనిక, రైతులు శివుడు, బీచుపల్లి, నరేష్, వెంకటన్న, చిరంజీవి ఉన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



మల్దకల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వ్యవసాయ అధికారులు, రైతులు



మానవపాడు రైతువేదికలో రైతులకు వీసీ ద్వారా అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మల్దకల్: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందని ఏఓ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మల్దకల్ రైతు వేదికలో వ్యవసాయ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మానవపాడు: రైతుల పంటలపై దృశ్యశ్రావణ పరికరం ద్వారా హైదరాబాద్ నుంచి ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్తి, మిరప, మొక్కజొన్న, కంది తదితర రైతులు సాగు చేసిన పంటలపై రైతుల సందేహాలు, నివృతి చేశారన్నారు. పత్తిలోని చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల జాబితా కలెక్టర్‌కు అందించాం

- రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తాం
- పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి



మానవపాడులో రైతులతో చర్చిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి

మానవపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రుణమాఫీ జాబితాలో లేనివారి వివరాలు వ్యవసాయ అధికారులకు, కలెక్టర్‌కు అందించామని మండల పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో 371మంది రైతులకు రుణమాఫీ లిస్ట్‌లో పేర్లు వచ్చాయని, ఇంకా 502 మందికి రుణమాఫీ ఇవ్వాలని అధికారులకు నివేదికలు అందించామన్నారు. సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు రూ.3 కోట్లకు పైగా రుణాలు మాఫీ జరిగిందని. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే దఫాలో రుణాలు మాఫీ కాబోతున్నాయని తెలిపారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తామని, కావాల్సిన రైతులు సహకార సంఘం నందు సంప్రదించాలన్నారు. సహకార సంఘంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సర్వేయర్లతో రైతుల వాగ్వాదం



సర్వేయర్లతో వాగ్వాదం చేస్తున్న రైతులు

అయిజ: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ గోవిందు, అసిస్టెంట్ ఏడీ రామచంద్ర, మండల సర్వేయర్ హరికృష్ణ మంగళవారం సర్వే చేసేందుకు మండలంలోని బింగుదొడ్డి శివారుకు వెళ్లారు. బింగుదొడ్డి గ్రామానికి చెందిన కొందరు రైతులు సర్వే చేయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులమధ్య వాగ్వాదం జరిగింది. చేసేదేమీ లేక సర్వేయర్లు వెనక్కి వెళ్లి పోయారు. మండలంలోని బింగుదొడ్డి శివారులో సర్వే నెంబర్ 62లో 3 ఎకరాల 16 గుంటల భూమి వివాదాస్పదంగా మారింది. అయిజ పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ సుమంగళి ఆమె భర్త శ్రీధర్ నుంచి గతంలో బింగుదొడ్డి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. మిగులు భూమి ఉన్నట్లుగా ఇటీవల తేలడంతో ఆ భూమిని చేజిక్కించుకునేందుకు సుమంగళి ఆమె భర్త శ్రీధర్‌లు హై కోర్టును ఆశ్రయించారు.

బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి జంబయ్య

కేటీదొడ్డి: విద్యుదాఘాతంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి జంబయ్య అన్నారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాహిదా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగన్‌పల్లి, కొండాపురం గ్రామానికి చెందిన జంగిలమ్మ, నర్సింహులు ఈనెల 20, 22న విద్యుదాఘాతంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయన్న, అంజనప్ప, రంగప్ప, తదితరులు ఉన్నారు.

పరిహారం కోసం రైతుల ఆందోళన

గట్టు: భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తప్పెట్లమొర్సు రైతులు నష్ట పరిహారం కోసం మంగళవారం ఆందోళనకు దిగారు. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్న వద్దకు తప్పెట్లమొర్సు గ్రామరైతులు చేరుకుని పనులు అడ్డుకుని, వంటావార్పుతో ఆందోళనకు దిగారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూములతో పాటుగా పండ్ల తోటలు, ఇతర నిర్మాణాలకు తక్కువ పరిహారం చెల్లిస్తున్నట్లు ఆరోపించారు. రెండో విడత నష్ట పరిహారం చెల్లింపులో జరుగుతున్న ఆలస్యంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూముల్లోని బోర్లు, నిర్మాణాలకు నష్ట పరిహారం సక్రమంగా అందలేదని రైతులు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుని రైతులు నిరసన తెలిపారు. రెండో విడత నష్ట పరిహారం చెల్లించే దాకా ఆందోళన కొనసాగిస్తామని రైతులు తెలిపారు.

బురదరోడ్లతో ప్రజల ఇక్కట్లు

రాజోళి: మండలంలోని పచ్చర్లలో రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తిరిగే రోడ్లన్నీ బురద కావడంతో అడుగు తీసి, అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. కురుస్తున్న వర్షాలకు రోడ్లు, డ్రెయినేజీలు నిండి పొరుతున్నాయి. కాలనీల్లో డ్రెయినేజీలు లేక మురుగు రోడ్లపైనే ప్రవహించి, దుర్వాసన వస్తోంది. దోమలు పెరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అధికారులు వ్యాధుల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బురదగుంటగా మారిన పచ్చర్ల ప్రధాన రహదారి

పర్యావరణాన్ని రక్షించుకుందాం



మొక్క నాటుతున్న ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి

అయిజ: వృక్షాలను విచక్షణ రహితంగా నరికి వేయడంతో పర్యావరణం పూర్తిగా దెబ్బతిన్నదని, విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మేడికొండ గ్రామ శివారులో ఎక్సైజ్ పోలీసులు ఈత చెట్లను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ గౌడ సంఘం నాయకులు ఈతచెట్లను నాటి వాటిని సంరక్షించి ఆర్థికంగా లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు రామన్ గౌడ్, నరసింహులు గౌడ్, శివన్న గౌడ్, రామయ్య గౌడ్, చిన్న రంగస్వామి గౌడ్, ఎక్సైజ్ శాఖ పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయికులు

గట్టు: ముదిరాజ్‌లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మత్స్య సహకార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మత్స్య సహకార సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్‌లకు అభయహస్తంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముదిరాజ్‌లు అన్ని విధాలుగా వెనుక బడినట్లు తెలిపారు. మత్స్యకారులు కుల వృత్తిని వదిలేసి ఇతర వృత్తులను ఎంచుకున్నట్లు తెలిపారు. అభయహస్తంలో పేర్కొన్న విధంగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలన్నారు. రాజకీయ రంగంలో ప్రాధాన్యం కల్పించేందుకు రాష్ట్ర మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు చోటు కల్పించాలన్నారు. శాసన మండలిలో ముదిరాజ్‌లకు 3 స్థానాలను కేటాయించాలన్నారు. ముదిరాజ్‌ల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆ సంఘం నాయకులు కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గట్టు అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు తిమ్మయ్య, వెంకటేష్, నర్సింహులు, తిమ్మప్ప, పరశరాం, వీరేష్, గట్టు తిమ్మప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పెద్దదిన్నెలో పాఠశాల సమస్యలపై ఆరా తీస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ అశోక్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పాఠశాలకు హాజరుకావాలని మండల ఇన్‌చార్జి విద్యాధికారి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వినియోగించుకొని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ప్రతిరోజు మెనూ ప్రకారం పరిశుభ్రమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



మందులు అందజేస్తున్న టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్

రాజోళి: టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ వ్యాధిగ్రస్తులకు ఆయన మంగళవారం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులకు ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. క్షయ వ్యాధి నిర్ధారణ కాగానే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తరపున అందించే మందులు క్రమం తప్పకుండా వాడుతూ, దురలవాట్లకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరు నెలలు మందులు వాడితే టీబీని తరిమికొట్టవచ్చని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులు, మిత్రులు కూడా వారికి మనోధైర్యం అందించాలని, ఎప్పటికప్పుడు ధైర్యం కోల్పోకుండా ఆరోగ్యకర వాతావరణంలో గడిపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై కలెక్టర్‌కు గ్రామస్తుల మొర



నెట్టెంపాడులో రోడ్లపై నిలిచిన మురుగు

ధరూరు: గ్రామంలో ఉన్న అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని, రోడ్లపైనే ఎక్కడ పడితే అక్కడ వర్షపు నీరు, మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, 'కలెక్టర్ గారూ..మా గోస జర చూడండి' అంటూ నెట్టెంపాడు గ్రామస్తులు వేడుకుంటున్నారు. మంగళవారం వారు సోషల్ మీడియాలో ఓ పోస్టు చేయగా, అది వైరల్ అవుతోంది. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించిన అధికారులు, పాలకులు రోడ్లకు ఇరు వైపులా డ్రెయినేజీలు నిర్మించలేదని తెలిపారు. గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు నిలుస్తోందని తెలిపారు. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలతో రోడ్లన్నీ జల మయం అయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇటీవల దోమల బెడద తీవ్రమైందని, తద్వారా డెంగీ, మలేరియా వంటి విష జర్వాల బారిన పడుతున్నట్లు తెలిపారు. తమ 'గ్రామానికి ఒక సారి వచ్చిచూడండి కలెక్టర్ గారూ' అంటూ పోస్ట్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని బూడిదపాడు, బిజ్వారం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా బుధవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

అయిజ: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్న తాండ్రపాడు సబ్‌స్టేషన్‌లో కాలిపోయిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు. మండలంలోని చిన్నతాండ్రపాడు, మేడికొండ, తుపత్రాల, కేశవరం, వేణుసోంపురం గ్రామాలకు 8గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ప్రమాదకరంగా కల్వర్టు రహదారి



మానవపాడు: రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణం వర్షానికి కోతకు గురై ధ్వంసమవుతోంది. సోమవారం రాత్రి కల్వర్టు వద్ద ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. తృటిలో ప్రాణపాయం తప్పిందని చెన్నిపాడు గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రమాదం ఉందని ఎర్రజెండాను, గుంతకు పెద్దరాళ్లు అడ్డుగా పెట్టారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును ఆర్అండ్‌బీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంధకారంలో ధరూరు

ధరూరు: మండల కేంద్రంలోని ఆయా కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. గ్రామంలో వీధి లైట్లు లేక జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలతో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమల బెడద తీవ్రం ఉందని, జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచుల పాలన ముగియడంతో ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం



అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడుగా పనిచేస్తున్న చక్రవర్తి ధూప దీప నైవేద్య అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా సోమవారం రాత్రి అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు వాసు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్న వజ్జల ప్రసాద్ శర్మ, వనపర్తి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.